# నిర్నిమిత్తం

రాత్రి తొమ్మిది కావస్తోంది. గత రెండుగంటలుగా కురుస్తోన్న వర్షం తగ్గేట్లు లేదు. కొట్టుకట్టేసి ఇంటికి వెళ్ళిపోదామనుకుంటున్న సమయంలో ఒకామె గొడుగు వేసుకుని దాదాపు పరుగెత్తుకుంటూ నా కొట్లోకి వచ్చింది. ఆమెకు ముప్పయి అయిదు సంవత్సరాలుంటాయేమో, చామనచాయలో సన్నగా ఉంది. అంత పొడుగూ కాదు, పొట్టి కాదు. కోల ముఖం. గొడుగు మడిచి తలుపు వారగా పెట్టి నా ముఖంలోకి చూసింది. కొట్టుకట్టేదామన్న ఆలోచన అప్పటికి పక్కన పెట్టి ఆమె ముఖంలోకి చూస్తూ నిలబడ్డాను. వెలుగు మసకగా ఉంది. జల్లు వరండా మీద పడుతోంది.

"ఫోను చేసుకుంటాను" అంది.

"ఎస్.టి.డి.నా,లోకలా?" అడిగాను.

"లోకల్" అంది.

ఫోను ఆమె ముందుకు జరిపాను.

నల్లటి చిన్న పర్సులో నుండి మడతలు పడిన కాయితం తీసి అది గాలికి ఎగిరిపోకుండా రిసీవరు కింద పెడుతోంటే స్టూలు చూపించి "కూర్చోండి" అన్నాను.

కూర్చుని, "థేంక్స్" అని కాగితంలోని మొదటి నెంబరుకు డయల్‌చేసింది. వేళ్లు తడిగా, పొడుగ్గా ఉన్నాయి. తొందర్లో ఉన్నట్లు అనిపిస్తోంది.

"టెలికాం ఆఫీసాండీ? నాకు వెంకటేశ్వర్లుగారు కావాలి.. మీరేనా? .. నమస్కారమండీ.. మీపేరు వినడమే కాని మిమ్మల్నెప్పుడూ చూడలేదు. నాపేరు సరోజిని. సంగారెడ్డిలో పనిచేసిన లక్ష్మీకుమారికి అక్కయ్యనండీ.. గంట కిందట లక్ష్మికి  ఆడపిల్ల పుట్టింది. కంగ్రాచ్యులేషన్స్. పాప అచ్చం మీపోలికేనని లక్ష్మి చెప్పింది.. ప్రసవం కష్టంగానే అయింది... ఎక్కడంటారా? ... విద్యానగర్ రమా మెటర్నటీ హోంలో.. సిజేరియన్ కాదు. నార్మల్ డెలివరీ. మీరు ఇక్కడకు రావడానికి వీలుంటుందా? ... వీలుకాదా? పోనీ ఎప్పుడు రాగలరు? ఫోను నెంబరు ఏదీ లేదండీ... రేపొస్తారా? మీ ఇష్టం.... లక్ష్మికి ఏమయినా చెప్పమంటారా? సరే. ఉంటానండీ" దీర్ఘంగా నిట్టూర్చి ఫోను పెట్టేసింది.

బాల్‌పెన్ తీసింది.దానికి మూతలేదు. మొదటి నెంబరు టిక్ పెట్టి దాని కింది నెంబరుకు ఫోనుచేసి సాయిప్రసాద్ అనే అతనికి వెంకటేశ్వర్లుతో ఏం చెప్పిందో అవే మాటలు పొల్లుపోకుండా చెప్పింది. సరైన జవాబు రాలేదనుకుంటాను, ఫోను పెట్టేసి నా వంక ఇబ్బందిగా చూసింది. కొట్టు కిటికీ తలుపులు మూస్తుంటే "ఇంకో రెండు ఫోన్లు" అంది.

"చేసుకోండి".

ఈసారి దీనదయాళ్ అనే అతనికి ఫోను చేసింది. సందేశంలో ఎటువంటి మార్పులేదు. అతనూ వస్తానని అనలేదనుకుంటాను. నిరుత్సాహపడుతూ ఫోను పెట్టేసింది. నాలుగో నెంబరుకు డయల్‌చేసి వినయంగా, "నమస్కారం సార్.. మీ ఇంట్లో అద్దెకుంటున్న నారాయణరావుగారిని పిలుస్తారండీ.. నేను వాళ్ళ పెద్దమ్మాయిని.. అవును. సరోజినినండీ... మీకు శ్రమ ఇస్తున్నందుకు నన్ను క్షమించండి.. లైన్లో ఉంటాను. అర్జంటు విషయమని చెప్పండి..." అంది.

పర్సులోంచి యాభై రూపాయల నోటు తీసి నాకందించి, "నాలుగు కాల్స్" అంది. నేను తిరిగిచ్చిన డబ్బు లెక్కపెట్టుకోలేదు. పర్సులో పెట్టుకుంది. లైన్లో రావడానికి, నారాయణరావు ఎక్కువ సమయం తీసుకోలేదు... "నాన్నా... నేను... సరోజినిని... ఆస్పత్రి దగ్గరున్న కొట్లోంచి మాట్లాడుతున్నాను... ఇక్కడ ఒకటే వర్షం... రెండు గంటల నుంచి పడుతోంది... మీకు అక్కడ వర్షం లేదా?... అమ్మ ఆరోగ్యం ఎలా ఉంది?... మాత్రలు వేసుకున్నారా? .. గంట కిందట లక్ష్మి ప్రసవించింది. ఆడపిల్ల పుట్టింది. మీరు రానవసరం లేదు. పిల్ల బాగానే ఉంది. కాన్పు కష్టంగానే అయింది. ఇక్కడ పనులు చూసుకుని నేనే అటు వస్తాను.. సరే, సరే... అంతా దాని ఖర్మ అనుకుందాం... అదిమూర్ఖురాలే... మొండిది... ఒకరి మాట వినే మనిషయితే ఇంత వరకు ఎందుకు తెచ్చుకుంటుంది?.. పోనీండి.. అయిపోయిందేమో అయిపోయింది.." ఆమె కళ్ళల్లోంచి నీళ్ళు కారుతున్నాయి. దుఃఖాన్ని మాటల్లో ధ్వనించకుండా చీరకొంగుతో కన్నీళ్ళు తుడుచుకుంటూ, "నాన్నా.... నా మాట నింపాదిగా వినండి.. మీరు ఇక్కడకు రావద్దు... అన్నీ నేనుచూసుకుంటాను... ఏం లేదు.. అరగంట కిందట లక్ష్మి చనిపోయింది.... ఇహ దాన్ని తిట్టొద్దు..." అని ఫోను పెట్టేసి చాలాసేపటి వరకు ఏడుస్తూ ఉండిపోయింది.

❖ రచన, ఆదివారం వార్త, 18 నవంబర్ 2007